# వెలుగొచ్చింది

- ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి

అప్పుడే ఆఫీసు నుండి వచ్చిన రామనాథం దిగులుగా కుర్చీలో కూర్చున్నాడు.

''ఏమయింది? అలా ఉన్నారేం?'' అంది భారతి కాఫీ ఇస్తూ ఆత్రంగా.

చెయ్యి కళ్లమీద నుంచి తీసి కళ్లు తెరిచాడు రామనాథం. కానీ మాట్లాడలేదు.

''ఏమయింది? ఆఫీసులో ఏదైనా సమస్యా?'' అంది. తలూపాడు.

''ఏమిటి?'' అంది.

''భారతీ! ఈ నెలనుంచి ఎలా గడుస్తుందో ఏమో? మా కంపెనీకి నష్టాలు వచ్చాయని నా జీతం వెయ్యి రూపాయలు తగ్గించేసారు'' అన్నాడు.

''ఆ'' అంది భారతి.

''అవును భారతీ. చాలామందినయితే అసలే తీసేసారు. నేను ఎప్పటినుంచో ఉన్నానని జీతం తగ్గించి ఇష్టమైతే వుండమన్నారు. లేకపోతే లేదన్నారు. వెళ్లిపోగలిగే వయసా నాది? ఇప్పుడెవరిస్తారు?'' అన్నాడు భారంగా.

''ఎలాగండి మరి? మీకొచ్చే జీతమే ఏ మూలకీ సరిపోవడంలేదు. తక్కువ వస్తే ఎలా?'' అంది స్వగతంలా.

''అదేకదా నా బాధ. ఎలా గడుస్తుందో మనకి. అసలే చుట్టాలెక్కువ'' అన్నాడు.

''సరే కానివ్వండి. ఏం చేస్తాం? మీరన్నట్లు అసలు ఉద్యోగం పోలేదుకదా. అందుకు ఆనందించాలి'' అంది కొంచెం గుండె నిబ్బరం చేసుకుంటూ.

''ఎలాగో చూద్దాంలెండి. మీరు బెంగ పెట్టుకోవద్దు'' అంది. ''లేవండీ. మళ్లీ ఆఫీసుకి లేటవుతుంది'' అంటూ లేపుతున్న భారతిని చూస్తూ ''మళ్లీ పనిమనిషి రాలేదా?'' అన్నాడు విసుగ్గా. మసి మరకలతో, చెదిరిన జుట్టుతో వుంది భారతి.

''లేదు మానిపించేసాను'' అంది.

''అదేమిటి?'' అన్నాడు ఆశ్చర్యంగా.

''అసలే జీతం తగ్గి పోయింది కదా. మళ్లీ ఆ ఖర్చు కూడా ఎందుకు? అయినా మీరెళ్లిపోతే నాకు పనేం వుంటుంది కనుక'' అంది నవ్వుతూ.

''పోనీ గిన్నెలైనా తోమించుకో. చేసుకోలేవు'' అన్నాడు జాలిగా చూస్తూ.

''ఎందుకు చేయలేను. రెండురోజులు చేస్తే సరి. అదే అలవాటవుతుంది. మీరు లేవండి'' అంది లోపలికి వెళ్తూ.

''డాడీ స్కూలుకెళుతున్నాం'' అన్నారు పిల్లలు.

''అప్పుడే బయలుదేరారేమిటి? ఇంకా చాలా టైముంది'' అన్నాడు ఆశ్చర్యంగా.

''ఇదిగో బస్సు డబ్బులు'' అంటూ చెరో అయిదు రూపాయలు ఇచ్చాడు.

''వద్దు డాడీ. ఎంత దూరం. నడిచే వెళ్తాం. అన్నాడు రాము.

వాళ్ల ముద్దు మాటలకి కళ్లల్లో నీళ్లు తిరగబోయాయి.

''ఫర్వాలేదు. బస్సులోనే వెళ్లండి. నేనెలాగో చూస్తాను'' అంటూ బలవంతంగా చేతిలో పెట్టాడు. బస్సుకేకాక చెరో రూపాయి కొనుక్కోవడానికి కూడా తీసుకుంటారు రోజూనూ.


''సరే అయితే. ఈ నెలంతా ఇది చాలు. ఏమయినా అత్యవసర పరిస్థితుల్లో బస్సు ఎక్కడానికి మాత్రమే'' అంది రమ. టాటా చెప్పి వెళ్లిపోయారు.

''అన్నం పెట్టాను రండి'' అంది భారతి.

''ఇదేమిటి ఒక్క పాలకూర పప్పేనా?'' అన్నాడు.

''అవును. కూరల ఖర్చు తగ్గించాలి. పప్పు ఎలాగూ ఏడాదికి సరిపడ కొన్నాంగా'' అంది.

''సరే'' అన్నాడుకానీ నాలుగు ఐటమ్స్ లేనిదే తినలేని భారతి, పిల్లలు పప్పు చారుతో సరిపెట్టుకోవడం బాధగా వుంది. ''మీరేం బాధపడకండి. కూరలు లేకపోతే చచ్చిపోము. అయినా మీ ఆరోగ్య సూత్రాల ప్రకారం ఇదే కదా బలం'' అంది నవ్వుతూ భారతి రామనాథం మొహంలో భావాలను గ్రహిస్తూ.



మామూలుగా వున్నప్పుడు పొదుపు కోసం చెప్పే మాటల్నే అప్పగించింది.

''బోలెడు ఖాళీస్థలం ఉందిగా. కూరమొక్కల్ని పెంచవచ్చు'' అంది భారతి.

''నేవెళ్లొస్తాను భారతీ. తలుపేసుకో'' అన్నాడు.

''ఉండండి'' హడావుడిగా వచ్చింది. చేతిలో డబ్బా వుంది.

''ఏమిటిది?'' అన్నాడు.

''అన్నమే. కొంచెం పులిహోరలా చేసాను. పిల్లలకి, మీకూను. లేకపోతే మీరసలు ఏమీ తినరు దిగులుతో, పొదుపుతో అంటూ పెళ్లినాటి ప్రజెంటేషన్ బ్యాగులో డబ్బా పెట్టి చేతికి ఇచ్చింది.

''ఎందుకలా హైరానా పడతావు?'' అన్నాడు కొంచెం కోపంగా, బాధగా.

''లేదు నాన్నగారూ. బయట సినిమాలు బంద్. అయితే క్యారమ్స్, లేకపోతే చదువు సెలవురోజు'' అన్నాడు రాము.

''లేకపోతే టీవీలో సినిమా వస్తే అది'' అంది రమ.

''గుడ్'' అంది భారతి రేడియో వింటూ.

''ఇదంతా తమరి ప్రభావమా?'' అన్నాడు నవ్వుతూ.

''అయితే తప్పేంటి? మంచి మాటేగా?'' అంది భారతి కూడా నవ్వుతూ.

''సరే భోజనంచేసి వద్దాం. నలుగురూ ఆడొచ్చు'' అన్నాడు.

''హేయ్ హేయ్'' అన్నారు పిల్లలు ఆనందంగా.

సాయంత్రం ఎలా అయిందో తెలియలేదు.

రాము, రమలతోపాటు వారు కూడా చిన్నపిల్లలై ఆడారు. ఎప్పుడూ లేనిది తండ్రి కూడా తమతో ఆడేటప్పటికి పిల్లలలో ఉత్సాహం ఎక్కువైంది.

''ఇవాళ సినిమాకెళదామోయ్! ఒక్కటిచూస్తే మరేం ఫర్వాలేదులే'' అన్నాడు వెనక్కి వాలుతూ.

''నో! నెలంతా ఎకానమీ డ్రైవ్ అంతే'' అంది ఖచ్చితంగా భారతి.

''పోనీ టాంక్‌బండ్. అది ఖర్చులేని పనేగా'' అన్నాడు.

''కానీ ఒక్క షరతు. అక్కడ ఐస్‌క్రీంలు అవీ కొనకూడదు'' అంది.

''లేదు మమ్మీ. రేపు మాకు పరీక్ష వుంది. చదువుకోవాలి'' అన్నారు.

''అవునండీ. కేబుల్ టీవీలో మంచి సినిమా వుంది. పిల్లలకి పరీక్షలుగా. ప్రక్కింట్లో చూస్తాలెండి. కావాలంటే మీరొక్కరే వెళ్లండి సినిమాకి'' అంది.

పిల్లల చదువు పాడైపోతుందని ఎంత అడిగినా కేబుల్ పెట్టించలేదు.

''అబ్బే నాకొద్దులేవోయ్ ఆ శిక్ష. మీరే సరదా పడతారని అన్నాను. నేను సుందరం ఇంటికి వెళతాను. చాలా రోజులయింది'' అన్నాడు. ''తొందరగా వచ్చేయండి'' అంది.

తలూపుతూ వెళ్లిపోయాడు. సుందరం లేడు. బయటకు వెళ్లాడుట.

అప్పుడే ఇంటికి వెళ్లబుద్ధికాక పార్కులో కూర్చున్నాడు.

క్రిందటి నెలలో వచ్చినప్పుడు తల్లీతండ్రీ అన్న మాటలు గుర్తొచ్చాయి.

''ఏమిట్రా ఈ ఇల్లు సత్రం కొంపలా ఉంది. నువ్వు తెచ్చేది తక్కువ జీతం. ఖర్చు చూస్తే వేలల్లో వుంది. నీ పెళ్లాం కట్టిన చీర మళ్లీ కట్టదు. జమిందారీలా నడుస్తోంది మీ కాపురం. ఇలా అయితే పిల్లకి పెళ్లిచేసి, పిల్లాడ్ని చదివించినట్లే. మమ్మల్ని పోషించకపోయినా కనీసం మీరైనా అప్పులు లేకుండా వుండేలా చూసుకో''

నిజమే. తన ఇంట్లో జాతరలా వుంటుంది. చుట్టాలు నెలల తరబడి ఉండడం, స్టేటస్‌కి మించిన ఖర్చు. తన జీతం ఏ మూలకూ రాదు. కానీ ఏంచేస్తాడు? తను మెతక మనిషి. గట్టిగా చెప్పలేడు. అందుకే ఈ నాటకం. తన భార్యా పిల్లలని పరీక్షించడానికి జీతం తగ్గిపోయిందని చెప్పాడు.

''అమ్మో! మీకేం భయంలేదు. అవసరమైతే నా భార్యాపిల్లలు నాకంటే జాగ్రత్తగా జీవితాన్ని గడపగలరు. తమ బ్రతుకు తెల్లార్చుకోవడానికి తగిన తెలివితేటలు, సహనం వున్నాయి'' అనుకున్నాడు తృప్తిగా. పార్కులో లైట్లు వేసారు. పట్టపగలులా వెలుగు చిమ్మింది పార్కంతా. చీకటి పడి చాలా సేపయిందని గ్రహించి ఇంటికి బయలుదేరాడు రామనాథం. ఇంటికి వెళ్లిన వెంటనే తన భార్యకి తన నాటకం విషయం చెప్పేయాలని ఆ క్షణంలోనే నిశ్చయించుకున్నాక అతడి మనసు కుదుటపడింది.

★